# పేతురు వ్రాసిన మొదటి పత్రిక 4వ అధ్యాయము

**పాపమును విడిచిపెట్టుట**

క్రీస్తు శరీరరమందు శ్రమపడెను గనుక మీరును అట్టి మనస్సును ఆయుధముగా ధరించుకొనుడు 2 శరీర విషయములో శ్రమపడినవాడు శరీరమందు జీవించు మిగిలిన కాలము ఇకమీదట మనుజాశలను అనుసరించి నడుచుకొనక, దేవుని ఇష్టానుసారముగానే నడుచుకొనునట్లు పాపముతో జోలి యిక నేమియులేక యుండును. 3 మనము పోకిరి చేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితోకూడిన ఆటపాటలు, త్రాగుబోతుల విందులు, చేయదగని విగ్రహపూజలు మొదలైనవాటియందు నడుచుకొనుచు, అన్యజనుల ఇష్టము నెరవేర్చుచుండుటకు గతించిన కాలమే చాలును. 4 అపరిమితమైన ఆ దుర్వ్యాపారమునందు తమతోకూడ మీరు పరుగెత్తక పోయినందుకు వారు ఆశ్చర్యపడుచు మిమ్మును దూషించు చున్నారు. 5 సజీవులకును మృతులకును తీర్పుతీర్చుటకు సిద్ధముగా ఉన్నవానికి వారు ఉత్తరవాదులైయున్నారు.

6 మృతులు శరీరవిషయములో మానవరీత్యా తీర్పు పొందునట్లును ఆత్మ విషయములో దేవుని బట్టి జీవించునట్లును వారికి కూడ సువార్త ప్రకటింపబడెను. 7 అయితే అన్నిటి అంతము సమీపమైయున్నది కాగా మీరు స్వస్థబుద్ధిగలవారై, ప్రార్థనలు చేయుటకు మెలకువగా ఉండుడి 8 ప్రేమ అనేక పాపములను కప్పును గనుక అన్నిటికంటె ముఖ్యముగా ఒకనియెడల ఒకడు మిక్కటమైన ప్రేమగలవారై యుండుడి 9 సణుగుకొనకుండ ఒకనికి ఒకడు అతిథ్యము చేయుడి 10 దేవుని నానావిధమైన కృపవిషయమై మంచి గృహ నిర్వాహకులైయుండి యొక్కొకడు కృపావరము పొందిన కొలది యొకనికొకడు ఉపచారము చేయుడి 11 ఒకడు బోధించినయెడల దైవోక్తులను బోధించునట్లు బోధింపవలెను ఒకడు ఉపచారము చేసినయెడల దేవుడు అనుగ్రహించు సామర్థ్యమునొంది చేయవలెను. ఇందువలన దేవుడు అన్నిటిలోను యేసుక్రీస్తు ద్వారా మహిమపరచబడును. యుగయుగములు మహిమయు ప్రభావమును ఆయన కుండునుగాక, ఆమేన్.

**క్రీస్తు కొరకు శ్రమపడుట అధికృతయైయున్నది**

12 ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్ని వంటి మహా శ్రమను గూర్చి మీకేదో ఒక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి 13 క్రీస్తు మహిమ బయలుపరచ బడినప్పుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము, క్రీస్తు శ్రమలలో మీరు పాలివారైయున్నంతగా సంతోషించుడి 14 క్రీస్తు నామము నిమిత్తము మీరు నిందపాలైనయెడల మహిమాస్వరూపియైన ఆత్మ అనగా దేవుని ఆత్మ, మీ మీద నిలుచు చున్నాడు గనుక మీరు ధన్యులు. 15 మీలో ఎవడును నరహంతకుడుగా గాని, దొంగగా గాని, దుర్మార్గుడుగా గాని, పరులజోలికి పోవువాడుగాగాని బాధలనుభవింప తగదు. 16 ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించినయెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను. 17 తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది అది మనయొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి ఏమవును ? 18 మరియు నీతిమంతుడే రక్షింపబడుట దుర్లభమైతే భక్తి హీనుడును పాపియు ఎక్కడ నిలుతురు? 19 కాబట్టి దేవుని చిత్త ప్రకారము బాధపడువారు సత్ ప్రవర్తన గలవారై, నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకొనవలెను.